క్లుప్తంగా

రావులమ్మకు సారె సమర్పణ



రావులమ్మవారికి చీర, సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

అయినవిల్లి: లోకకల్యాణార్థం అయినవిల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్న రావులమ్మ వారికి మహిళలు శుక్రవారం చీర, సారె సమర్పించారు. అయినవిల్లి, తొత్తరమూడి, ముక్తేశ్వరంపాలెంకు చెందిన మహిళలు పసుపు, కుంకుమ్మ, అమ్మవారికి చీర, రవిక, వివిధ పిండి వంటలతో కూడిన సారె పట్టుకుని అమ్మవారి నామస్మరణ చేస్తూ కాలినడకన రావులమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి చీర, రవిక కట్టి పూల దండలతో అలంకరించారు. అమ్మవారికి తెచ్చిన సారెను నైవేద్యంగా చెల్లించి ప్రసాదంగా తీసుకున్నారు. అమ్మవారికి కానుకలు, మొక్కులు చెల్లించారు. ఆషాఢమాసంలో అమ్మవారికి ఇలా పూజలు చేస్తే పిల్లాపాపలతో సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని పూర్వీకులు చెప్పేవారిని అ ఆచారంతోనే అమ్మవారికి సారె సమర్పించామని వారు చెప్పారు. రావులమ్మవారితో పాటు గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ, సత్తెమ్మ వార్లకు సారె సమర్పించారు.

8న పాఠశాలల్లో ఎన్నికలు

అంబాజీపేట: మండలంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈఓ1, 2లు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. ఈ నెల 8న మొత్తం 64 ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకోనున్నారన్నారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచాలని అన్ని పాఠశాలలకు తెలియజేశామన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జానకిరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత చైతన్య వేదిక ప్రతినిధులు పే బ్యాక్ టు సొసైటీ కార్యక్రమం ద్వారా 150 మందికి పుస్తకాలు అందజేశారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల మురళీకృష్ణ, జనార్దనరావు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పీఈటీ చొప్పల చంద్రశేఖర్, చుట్టుగుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ వయస్సును 62కు పెంచాలి

అంబాజీపేట: రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, ఒక రోజు జీతం నిలుపుదల చేసి 12 నెలల జీతం ఇప్పించాలని కోరుతూ అంబాజీపేటలో శుక్రవారం జరిగిన ఏపీ డీఎస్సీ 1998 ఎంటీఎస్ టీచర్స్ ఆత్మీయ సమావేశం కోరింది. విజయవాడలో ఈ నెల 4న జరిగే ఎంటీఎస్ టీచర్స్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని సమావేశం కోరింది. రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగా ఎంటీఎస్ 1998 ఉపాధ్యాయులందరినీ రెగ్యులర్ లేదా సెమీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన వారికి ఫిక్స్‌డ్ పింఛన్ ఇవ్వాలని కోరింది. చొల్లంగి కేశవకుమార్, కె.రాఘవేంద్రరావు, సీహెచ్ కేశవకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకం



మాగంలో కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అయినవిల్లి: సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పు ఇవ్వడం చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. శుక్రవారం కె.జగన్నాథపురం, మాగం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. 30 సంవత్సరాల ఉద్యమ పోరాటంతో మాదిగ జాతికి సుప్రీంకోర్టు తీర్పుతో స్వతంత్రత వచ్చిందన్నారు. ఇదంతా మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమేనన్నారు. తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు నాయమూర్తులకు ప్రధాని నరేంద్రమోదీకి, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు సాయంపై వినతి

మలికిపురం: రాజోలు నియోజకవర్గ పరిధిలో వరద ముంపునకు గురైన వరద బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఆర్థిక సాయం అందే విధంగా చూడాలని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లంక గ్రామాల్లో 4,528 బాధిత కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఒక వినతి పత్రంలో కోరారు. అలాగే వరద ముంపు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కోరారు.

జీవనోపాధికి ఆక్సిజన్

- వస్తువుల తయారీతో మహిళల ముందడుగు
- ఆక్సిజన్ అసోసియేషన్ సహకారం
- నాబార్డు చేయూత



పీచు బొమ్మల తయారీపై శిక్షణ పొందిన మహిళలు

మామిడికుదురు: ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలు ముందడుగు వేస్తున్నారు. తమకు జీవనోపాధిని కల్పించే వస్తువుల తయారీలో శిక్షణ పొంది తద్వారా తాము కూడా ఏ రంగంలోనూ తీసిపోమని నిరూపిస్తున్నారు. కొబ్బరి పీచుతో కళాత్మక బొమ్మల తయారీతో పాటు జూట్ బ్యాగులు, డొకరేటివ్ ఉత్పత్తుల తయారీలో తర్ఫీదు పొందుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు వీటిపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఎక్కడకు వెళ్లే అవసరం లేకుండా నేరుగా వారి ఇంటి చెంతనే శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలను ప్రోత్సహించే దిశగా నాబార్డు చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. జీవనోపాధి ఆధారిత శిక్షణ (ఎల్ఈడీపీ) కార్యక్రమం ద్వారా నాబార్డు మహిళలకు శిక్షణ ఇస్తుంది. నాబార్డు ఆర్థిక సహకారంతోనే ఈ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తోంది. తోట ఉమా మహేశ్వరి జూట్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నారు.

రాజోలు దీవిలో శిక్షణా శిబిరాలు

జూట్ బ్యాగులు, డెకరేటివ్ ఉత్పత్తుల తయారీపై ప్రస్తుతం రాజోలు దీవిలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌లో 30 మందికి 20 రోజులు శిక్షణ ఇస్తున్నారు. మలికిపురం మండలం కేశనపల్లిలో మొదటి విడతగా 30 మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం అదే మండలంలోని పడమటిపాలెంలో రెండవ బ్యాచ్‌కు ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఇదే మండలంలోని గూడపల్లికి చెందిన మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించారు. శిక్షణ సమయంలో ఒక్కొక్కరికి రూ.50 వంతున 20 రోజులకు రూ.1000 స్టైఫండ్‌తో పాటు సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కొబ్బరి పీచుతో కళాత్మకమైన బొమ్మల తయారీపై గతంలో పాశర్లపూడి, ఈదరాడ, అప్పనపల్లి, బి.దొడ్డవరం, జనుపెల్ల గ్రామాలకు చెందిన మహిళలకు శిక్షణ ఇచ్చారు.

జీవనోపాధికి ఉపయోగపడుతుంది



జూట్ బ్యాగుల తయారీతో పాటు డెకరేటివ్ ఉత్పత్తుల తయారీపై 20 రోజులు శిక్షణ పొందాం. గతంలో ఎప్పుడూ మహిళలకు ఈ తరహా శిక్షణ ఇవ్వలేదు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళల జీవనోపాధికి ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. మా స్వశక్తితో మేము జీవనం సాగించేందుకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు మరింత విస్తరించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు దీనికి ముందుకు రావాలి.

– చిక్క పద్మావతి, కేశనపల్లి

నాబార్డు సహకారం ప్రశంసనీయం



మహిళలను ప్రోత్సహించే దిశగా నాబార్డు చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం మాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎంతో మంది ఔత్సాహికులు ఉచిత శిక్షణపై మొగ్గు చూపుతున్నారు. జూట్ బ్యాగుల తయారీతో పాటు కళాత్మకమైన వస్తువుల తయారీపై కూడా మేము శిక్షణ పొందాం. తీరిక వేళల్లో జూట్ బ్యాగులు తయారు చేసుకునేందుకు మాకు అవకాశం లభించడం చాలా ఆనందంగా ఉంది. జూట్ బ్యాగులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా ఆలోచన చేయాలి.

– పలివెల శేషవేణి, కేశనపల్లి

150 మంది శిక్షణ పొందారు



గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు నాబార్డు ముందుకు రావడం ముదావహం. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు జూట్ బ్యాగులు, డెకరేటివ్ వస్తువుల తయారీపై కోనసీమ జిల్లాలో ఇంత వరకు సుమారుగా 150 మంది శిక్షణ పొందారు. మరింత మంది శిక్షణ పొందేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మహిళలు తయారు చేస్తున్న కొబ్బరి పీచు బొమ్మలను ప్రదర్శనల్లో విక్రయిస్తున్నాం. వాటికి మంచి ఆదరణ లభిస్తోంది.

– కటికిరెడ్డి గంగాధర్, ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, పాశర్లపూడి

పర్యావరణ పరిరక్షణ నాబార్డు ప్రాధాన్యం



పర్యావరణ పరిరక్షణకు నాబార్డు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. దీనిలో భాగంగా కొబ్బరి పీచుతో బొమ్మల తయారీ, జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. రైతులతో పాటు మహిళలకు నాబార్డు ప్రాధాన్యం ఇస్తుంది. శిక్షణ పొందిన మహిళలకు డీఆర్‌డీఏ, బ్యాంకుల సహకారంతో యూనిట్లు నెలకొల్పే దిశగా ముందుకు వెళ్తున్నాం. కొబ్బరితో పాటు ఇంతర రంగాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ వైఎస్ నాయుడు, ఏజీఎం, నాబార్డు

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో సమక్షంలో వాటర్ డిస్పెన్సర్ బహూకరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

సఖినేటిపల్లి: జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి శుక్రవారం సఖినేటిపల్లి మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ శాఖ వాటర్ డిస్పెన్సర్ బహూకరించింది. ఈ మేరకు డీఈవో ఎం.కమల కుమారి సమక్షంలో కార్యాలయ స్టాఫ్‌కు సదరు శాఖ ప్రతినిధులు ఇచ్చారు. డీఈవో కమలకుమారికి సంఘం తరఫున ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వివరాలు మండల సంఘ అధ్యక్షుడు పిల్లి హేమసుందర్ మీడియాకు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అమృతరావు, కంకటాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ దృష్ట్యా అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలన వివరించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడి



రైతుకు యూరియా బస్తా బహుమతిగా అందిస్తున్న వ్యవసాయాధికారులు

రాజోలు: విత్తనశుద్ధి చేయడం ద్వారా మెరుగైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం కడలి అరవపాలెంలో మండల వ్యవసాయశాఖ అధికారి వై.మధుకుమార్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. విత్తనాలను ఎంపిక చేసుకునే ముందు విత్తనాల మొలకశాతాన్ని నిర్ధారించుకోవాలన్నారు. విత్తనాల శుద్ధి చేసుకోవడం ద్వారా మట్టి, నీరు, గాలిలో ఉన్న శిలీంద్రాల ద్వారా నారుమడికి ఆశించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. బ్యాలెట్ టెస్ట్, విత్తనశుద్ధి, విత్తన మొలకశాతంపై రైతులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా బ్యాలెట్ టెస్ట్‌లో రైతు అరవ శేషుబాబు మొదటి స్థానంలో నిలవగా ఒక యూరియా బస్తాను బహుమతిగా అందజేశారు. వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శారద



పెనికేరులో తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తపేట: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పి.శారద అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మండలాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శుక్రవారం సీడీపీఓ శారద స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రసవం జరిగిన గంట లోపు తల్లి తన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. ముర్రు పాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. తల్లి పాలను తాగించడం ద్వారా బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లికి కూడా ఆరోగ్యమని అన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు విధిగా తల్లి పాలే తాగించాలన్నారు. దాదాపు రెండేళ్ల వరకూ తల్లి పాలు ఇవ్వవచ్చని సూచించారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనికేరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. శిశువుల ఆరోగ్య రీత్యా మహిళలంతా తల్లిపాల సంస్కృతిని మరింతగా ప్రోత్సహించాలంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వై.అరుంధతి, టీఎస్‌పీ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు వివరించారు. తల్లులందరూ పుట్టిన శిశువుకు అరగంటలోపే ముర్రుపాలు అందించాలన్నారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ తల్లిపాల వారోత్సవాల ర్యాలీలను నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తల్లి పాలల్లో మహత్తర శక్తి ఉందని పిల్లలకు మొదటి టీకాగా పని చేస్తాయని సీహెచ్ఓ బి.అప్పారావు, ఎస్‌పీఓ ఎస్‌వీరామారావులు పేర్కొన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ పిల్లల సక్రమమైన అభివృద్ధికి తల్లిపాలు చాలా అవసరమన్నారు. బిడ్డకు పౌష్టికాహారాన్ని ఇవ్వడమే కాదని తల్లిబిడ్డల బాంధవ్యాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ జీవీవీకే ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ కె.దుర్గాప్రసాద్, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.

తీర ప్రాంత సొసైటీలను ప్రక్షాళన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: తీర ప్రాంతాల్లో ఉన్న సీసీఎఫ్, ఎఫ్ఎల్‌సీ జాయింట్ ఫార్మింగ్ సొసైటీలను ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్‌యస్ ల్యాండ్ మార్క్ వద్ద శుక్రవారం జరిగిన సీసీఎఫ్, ఎఫ్ఎల్‌సీ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 36 సొసైటీలు ఉన్నాయని అన్నారు. ఇందులో సభ్యులుగా షెడ్యూల్ కులాల వారు ఎక్కువగా ఉన్నారని చనిపోయిన వారి స్థానంలో వారసులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని అన్నారు. సొసైటీల పరంగా భూముల వివరాలు స్పష్టంగా ఉండాలని, అ భూముల్లో ప్రస్తుత పంటల వివరాలు వాటి పరిస్థితి తెలియజేయాలని పేదలకు ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఇచ్చిందో ఆ ఉద్దేశం నెరవేరేలా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ప్రతి సామాన్య వ్యక్తికి న్యాయం జరగాలని అన్నారు. సమయానికి ఎన్నికలు జరుగుతున్నాయా లేదా అని, జరిగిన ఎన్నికలు పారదర్శకంగా జరిగాయా లేదా అని అధికారులు సమీక్షించుకోవాలని, చాలా చోట్ల సొసైటీల్లో అక్రమాలు జరుగుతున్నాయని సొసైటీలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ ప్రక్షాళనలో సొసైటీ సభ్యులు పూర్తిగా సహకరించాలని సభ్యులను దేవ వరప్రసాద్ కోరారు. కార్యక్రమంలో జిల్లా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ మురళీకృష్ణ, అమలాపురం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ రాధాకృష్ణ, రాజోలు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఏసునాయన, వివిధ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిత్య చిరస్మరణీయుడు 'పింగళి'



కొత్తపేట డిగ్రీ కళాశాలలో పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు

కొత్తపేట: తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన పింగళి వెంకయ్య నిత్య చిరస్మరణీయుడని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకంతో కూడిన పింగళి వెంకయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్ పెద్దిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమ కాలంలో బ్రిటిష్ పతాకం రెపరెపలాడటం చూసి ఎంతో ఆవేదన చెందిన వెంకయ్య మనకంటూ ఒక జాతీయ పతాకం ఉండాలని భావించారన్నారు. ఆ ఆలోచనను విజయవాడలో కాంగ్రెస్ సదస్సు జరిగినప్పుడు పలు రకాల పతాకాల నమూనాలను గాంధీకి చూపించగా త్రివర్ణ పతాకానికి ఒక రూపాన్ని ఇచ్చారన్నారు. అలా 1921 మార్చి 31 న విజయవాడ వేదికగా జాతీయ పతాకం రూపకల్పనకు అంకురార్పణ జరిగిందన్నారు. అలా స్వాతంత్రోద్యమ జాతీయ నాయకుల్లో పింగళి వెంకయ్య ఒకరు కావడం తెలుగు జాతికి గర్వకారణమన్నారు. ఆయన జీవిత చరిత్రలోని పలు ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హిస్టరీ లెక్చరర్ భవాని, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకేతర సిబ్బంది జగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఎంవీఎన్ జేఎస్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ సత్యనారాయణ రావు పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, నక్క రమేష్‌బాబు, ఎన్.రాహేల్ బాబు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంపు నుంచి బయటపడుతున్న లంకలు



పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంకలో వరదలకు కుళ్లిపోయిన పచ్చి మిరప తోట

పి.గన్నవరం: వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాలు ముంపు నుంచి బయట పడుతున్నాయి. మానేపల్లి శివారు శివాయ లంకకు వెళ్లే దారిలో వరద నీరు తగ్గక పోవడంతో ఆ గ్రామ ప్రజలు ఇంకా ట్రాక్టర్‌పైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై వెళ్తున్నారు. వరదల వల్ల లంక భూముల్లోని పంటలు పాడవడంతో తీవ్ర నష్టాలకు గురైన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ విజయశ్రీ

మలికిపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహణపై శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో సమీక్ష జరిగింది. విద్యాశాఖాధికారి(ఎంఈవో) ఎం.విజయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీల పదవీ కాలం పూర్తి కావడంతో వాటి స్థానాల్లో కొత్తగా పాఠశాల యాజమాన్య (స్కూల్ మేనేజ్‌మెంట్) కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి విద్యాశాఖ కార్యాలయానికి స్పష్టమైన మార్గదర్శకాలు అందాయి. ఆగస్టు ఒకటో తేది నుంచి ఎనిమిది వరకు పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల ప్రక్రియ సాగనుందని కావున పాఠశాల ప్రధానోపాధ్యాయులందరూ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 8న ఎన్నికలు జరిగిన రోజునే కమిటీల ప్రమాణ స్వీకారం, తొలి సమావేశాలు నిర్వహించాలని తెలియజేశారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆర్.శేఖర్, ఎంఐయస్ఆర్ రవి, ఆఫీస్ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజ



లక్ష రుద్రాక్ష పూజలందుకుంటున్న కురంగేశ్వర స్వామివారు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగిలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామివారికి శుక్రవారం లక్ష రుద్రాక్ష పూజలను వైభవంగా నిర్వహించారు. పవిత్ర మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష రుద్రాక్షలతో స్వామివారికి విశేష పూజ చేశారు.

శాకంబరిగా విజయదుర్గమ్మ, ముత్యాలమ్మ



శాకంబరిగా విజయదుర్గమ్మ



ముంగండలో శాకంబరిగా ముత్యాలమ్మ వారు

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ ఎదురుగా ఉన్న బండారువారితోట విజయదుర్గమ్మను శుక్రవారం కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మ వారు భక్తులకు కనులపండువలా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గూడూరు వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ఈ అలంకరణ జరిగింది. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలంకరించామని అర్చకులు తెలిపారు.

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో వేంచేసిన ముత్యాలమ్మ వారు ఆషాఢమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ సర్పంచ్ నేలపూడి దుర్గారావు ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



ఓఎన్జీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో రహదారుల ఆధునీకరణ, పంట బోదెలపై రెండు కల్వర్టులు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు ఓఎన్జీసీ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోలా సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు స్థానికులతో కలసి ఓఎన్జీసీ అధికారులకు వినతి పత్రం ఇచ్చామని శుక్రవారం తెలిపారు. ఓఎన్జీసీ వాహనాల రాకపోకలతో గ్రామంలోని రహదారులు దెబ్బతిన్నాయని, పాడైపోయిన రోడ్డును పక్కా బ్లాక్ టాప్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. పంట బోదెలపై దెబ్బతిన్న కల్వర్టుల స్థానే నూతనంగా కల్వర్టులు నిర్మించాలని కోరామన్నారు. తమ డిమాండ్లపై వినతిపత్రం అందించామని, వాటిపై సానుకూలంగా స్పందించని పక్షంలో ఓఎన్జీసీ వాహనాల రాకపోకలను అడ్డుకుంటామని స్పష్టం చేశామన్నారు.